

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 253 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం, 14, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# స్వతంత్ర భారతదేశంలో..
# సర్వం కోల్పోతున్నాం!

● స్వాతంత్ర్యం వచ్చింది.. బతుకులు మారాయా? ● క్రమక్రమేన దిగజారుతున్న జాతీయ విలువలు ● 80వ స్వాతంత్ర్య దినోత్సవం వేళ.. జాతీయ జెండా రెపరెపలు.. ● కానీ సామాన్యుడి జీవితంలో ఇంకా చీకట్లే ! ● బ్రిటిష్ పాలన నుంచి విముక్తి సాధించాం.. కానీ పేదరికం నుంచి విముక్తి ఎప్పుడు? ● రాజ్యాంగం సమానత్వం చెప్పింది.. సమాజంలో వివక్ష మాత్రం ఇంకా పోవడం లేదు ● చదువుకున్న యువతకు ఉద్యోగం ఎప్పుడు? ● కష్టపడుతున్న కూలీ కుటుంబానికి గౌరవప్రదమైన జీవితం ఎప్పుడు? ● స్వతంత్ర్య భారతదేశంలో పేదరికం పెరిగిపోతుంది ● బ్రిటిష్ ఆధిపత్యం కన్నా దేశ పాలకుల ఆధిపత్యమే క్రూరంగా ఉంది ● జాతీయ జెండాను గౌరవిస్తూనే జాతీయత్వాన్ని దిగజారిస్తున్నారు ● డాక్టర్ బరిగెల శివ



డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తయి.. 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు దేశం సిద్ధమవుతోంది. ఎర్రకోటపై జాతీయ జెండా రెపరెపలాడుతున్నా.. సామాన్యుడి జీవితంలో చీకట్లు ఇంకా తొలగలేదన్న ఆవేదన వ్యక్తమవుతోంది. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి సాధించిన భారత్.. పేదరికం, నిరుద్యోగం, అసమానతల నుంచి మాత్రం ఇంకా పూర్తిగా బయటపడలేదని డాక్టర్ బరిగెల శివ అన్నారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తుండగా.. కష్టపడుతున్న కార్మిక కుటుంబాలకు గౌరవప్రదమైన జీవితం అందడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగం సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించినా.. కుల, సామాజిక, ఆర్థిక వివక్షలు ఇంకా కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ జెండాకు సెల్యూట్ చేయడమే దేశభక్తి కాదని.. పేదల కన్నీరు తుడవడం, అన్యాయాన్ని ప్రశ్నించడం కూడా దేశభక్తేనని స్పష్టం చేశారు. ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు, న్యాయం, గౌరవం లభించినప్పుడే స్వాతంత్ర్యానికి సంపూర్ణ అర్థం వస్తుందని అన్నారు. దేశ అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక ప్రగతి కాదని.. పేద ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు వచ్చినప్పుడే నిజమైన భారత ప్రగతి సాధ్యమవుతుందని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. - హైదరాబాద్(జై భీమ్ డెస్క్)

## పదేళ్ల బిఆర్ఎస్..
### రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం
రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
వారు చేసిన చేతబడి తిరగబడింది
నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్



8

## ఆబిడ్స్‌లో కారు బీభత్సం

● మహిళను ఢీకొన్న కారు ● తీవ్రంగా గాయపడిన సునీత ● సినీ నిర్మాతపై కుటుంబ సభ్యుల ఆరోపణలు ● అబిడ్స్ పోలీసుల కేసు నమోదు ● ప్రమాదంపై దర్యాప్తు కొనసాగింపు



8

## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు.
గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



4

## రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది

అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు
ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం
వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం



2

జై భీమ్
POWER OF PEOPLE
Jai Bheem

# ఘనంగా ఆస్పైర్ సమ్మిట్ 3.ఓ

ముఖ్య అతిథిగా నారాయణ విద్య సంస్థల డైరెక్టర్ పి రమ నారాయణ,జి ఎం గోపాల్ రెడ్డి : డిజిఎం రిజ్వానాఇమ్రాన్




**హన్మకొండ /కాజిపేట్ జై భీమ్ న్యూస్:-**



నారాయణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ రాజధాని అయిన హైదరాబాద్ స్మార్ట్ సిటీ సమీపన శిల్ప కల క్షేత్ర వేదికగా ఏర్పాటు చేసిన క్షేత్రంలో అత్యంత వైభవంగా2025-2026 ఆస్పిర్ సమ్మిట్ 3.ఓ ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి రమ నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2025 26 విద్యా సంవత్సరం గాను తెలంగాణ రాష్ట్రంలో నారాయణ స్కూల్ విభాగంలో విద్యాసంస్థలు అన్ని విద్య సంస్థల కంటే ముందు ఉన్నాయని సంతోషించారు,ఈ సందర్భంగా వరంగల్ జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రిజ్వానా ఇమ్రాన్ మాట్లాడుతూ...జోన్లో స్కూల్ విభాగంలో, వరంగల్ ఓ ఎన్ సి ఎస్ హై స్కూల్, కాజిపేట్ ఈ ఎన్ సి ఎస్ హై స్కూల్,హంటర్ రోడ్ ఎఫ్చ్ టీ ఆర్ స్కూల్ విశేష ప్రతిభ చూపించినందుకుగాను పాఠశాలకు సంబంధించి విశేష పత్రంతో పాటు క్యాష్ ప్రైస్ ప్రత్యేక బహుమతులు లభించాయాన్నారు, తమకు నిరంతరం మార్గదర్శనం చేస్తూ ప్రోత్సహిస్తున్న డైరెక్టర్ పి రమ నారాయణ, అదేవిదంగా జి ఎం గోపాల్ రెడ్డి కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లొ బ్రాంచ్ ప్రిన్సిపల్స్ రాజశేఖర్, అనిత, మమత, కోఆర్డినేటర్స్ సాయి కృష్ణ శ్యామల శిరీష ఏ ఓస్, ఆదిల్ చేరాలు,హరీష్ అకాడమీడింగ్స్ వంశీకృష్ణ చారి, వైస్ ప్రిన్సిపల్ అనూష కర్ణ శ్రీ, అనూష మౌనిక, పాజిలత్ సబిత, తదితర ఉపాధ్యాయ బృందం ఉన్నారు

# కాకతీయ క్యాంటీన్ ప్రారంభోత్సవం

సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో నూతన కాకతీయ క్యాంటీన్ ప్రారంభం
క్యాంటీన్ ప్రారంభించిన గౌరవ అతిథి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి.
ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య జ్యోతి.
సహాయ అతిథిగా పాల్గొన్న సుబేదారి సిఐ ఎన్ రంజిత్,






**సుబేదారి జై భీమ్ న్యూస్.:-**

గురువారం సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో కాకతీయ క్యాంటీన్ నూతనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వరంగల్ వెస్ట్ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి క్యాంటీన్‌ను ప్రారంభించారు. నూతన క్యాంటీన్ నిర్వాహకులు దూలం క్రాంతికుమార్ గౌడ్ సుదర్శన్ ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అభినందించారు. విద్యార్థులు, అధ్యాపకులు సిబ్బందికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి హాజరైన సుబేదారి సీఐ ఎం. రంజిత్ కుమార్ కూడా నూతన క్యాంటీన్ యజమానులను అభినందించి, క్యాంటీన్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జ్యోతి, లా కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుదర్శన్ , పీజీ కాలేజ్ ప్రిన్సిపల్ నిర్మల మేడం, నాన్-టీచింగ్ ఎన్జీవో అధ్యక్షుడు--సుబేదారి యూనిట్ రాజు నాయక్ , ఆర్ట్స్ కాలేజ్ టీచింగ్ ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ భిక్షపతి, ఫ్యాకల్టీ మెంబర్స్, నాన్-టీచింగ్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. కాకతీయ క్యాంటీన్ ప్రారంభంతో విద్యార్థులు, కళాశాల సిబ్బందికి మెరుగైన, పరిశుభ్రమైన ఆహార సదుపాయం అందుబాటులోకి వచ్చింది.

# స్వతంత్ర భారతదేశంలో సర్వం కోల్పోతున్నాం





స్వాతంత్ర్యం వచ్చింది.. బతుకులు మారాయా?
క్రమక్రమేన దిగజారుతున్న జాతీయ విలువలు
80వ స్వాతంత్ర్య దినోత్సవం వేళ.. జాతీయ జెండా రెపరెపలు.. కానీ సామాన్యుడి జీవితంలో ఇంకా చీకట్లే !
బ్రిటిష్ పాలన నుంచి విముక్తి సాధించాం.. కానీ పేదరికం నుంచి విముక్తి ఎప్పుడు?
రాజ్యాంగం సమానత్వం చెప్పింది.. సమాజంలో వివక్ష మాత్రం ఇంకా పోవడం లేదు
చదువుకున్న యువతకు ఉద్యోగం ఎప్పుడు?
కష్టపడుతున్న కూలీ కుటుంబానికి గౌరవప్రదమైన జీవితం ఎప్పుడు?
స్వతంత్ర్య భారతదేశంలో పేదరికం పెరిగిపోతుంది
బ్రిటిష్ ఆధిపత్యం కన్నా దేశ పాలకుల ఆధిపత్యమే క్రూరంగా ఉంది
జాతీయ జెండాను గౌరవిస్తూనే జాతీయత్వాన్ని దిగజారిస్తున్నారు
డాక్టర్ బరిగెల శివ

**హైదరాబాద్(జై భీమ్ డెస్క్)**

ఆగస్టు 15.. దేశానికి పండుగ రోజని డాక్టర్ బరిగెల శివ అన్నారు.దేశం స్వాతంత్ర్యం సాధించి 79 సంవత్సరాలు పూర్తయ్యాయి అయినప్పటికీ పేదల బతుకులు మారకపోవడం పట్ల తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేశారు. 80 సంవత్సరాల స్వతంత్ర భారతదేశ పరిపాలన దేశభక్తిని, దేశ అభివృద్ధిని, దేశ ప్రజలను, ఎంతవరకు పురోగతివైపు నడిపించగలిగిందో ఒకసారి జ్ఞాపకం చేసుకోవాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.దేశ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల తన మనోభావాలను తన ఆలోచనలను క్రింది విధంగా వ్యక్తపరిచారు. 2026లో 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఎర్రకోటపై జాతీయ జెండా రెపరెపలాడుతుంది. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామాలు, పట్టణాల్లో దేశభక్తి కార్యక్రమాలు జరుగుతాయి. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను గుర్తు చేసుకుంటాం. కానీ ఈ వేడుకల మధ్య ఒక ప్రశ్న మాత్రం ఇంకా వెంటాడుతూనే ఉంది.. స్వాతంత్ర్యం వచ్చింది.. కానీ అందరి బతుకులు మారాయా? బ్రిటిష్ పాలన నుంచి దేశం విముక్తి పొందింది. కానీ పేదరికంతో పోరాడుతున్న కుటుంబాలు ఇంకా ఉన్నాయి. చదువు పూర్తిచేసుకుని ఉద్యోగం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న యువత ఇంకా ఉంది. రోజంతా కష్టపడి పనిచేసినా కుటుంబాన్ని గడపడం కష్టంగా మారిన కార్మికులు ఇంకా ఉన్నారు. రైతు పంట పండిస్తాడు.. కానీ అతని జీవితంలో భరోసా ఎంత? కూలీ చెమటోడ్చి దేశాన్ని నిర్మిస్తాడు.. కానీ అతని కుటుంబానికి భద్రత ఎంత? యువత చదువుకుంటుంది.. కానీ ఉద్యోగం కోసం ఎందుకు తిరగాలి? పేద పిల్లలు కలలు కంటారు.. కానీ ఆ కలలకు సమాన అవకాశాలు అందుతున్నాయా? రాజ్యాంగం ఇచ్చిన హక్కులు.. సమాజం ఇస్తున్న అవకాశాలు ఎంత? భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను అందించింది. అయినప్పటికీ కుల వివక్ష, సామాజిక అసమానతలు, ఆర్థిక అంతరాలు పూర్తిగా తొలగిపోలేదు. కొంతమందికి అవకాశాలు తరతరాలుగా అందుతుంటే.. మరికొందరు ఒక్క అవకాశం కోసం కూడా పోరాడాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. స్వాతంత్ర్య భారతదేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు సమానమైన భవిష్యత్తు లభించినప్పుడే స్వాతంత్ర్యానికి పూర్తి అర్థం వస్తుంది.

**జెండా ఎగరేయడం మాత్రమే దేశభక్తి కాదు!**

ఆగస్టు 15న జాతీయ జెండాకు సెల్యూట్ చేయడం దేశభక్తే. కానీ అదే దేశభక్తి పేదవాడి కన్నీటిని తుడిచే సమయంలో, అన్యాయాన్ని ప్రశ్నించే సమయంలో, అవినీతికి వ్యతిరేకంగా నిలబడే సమయంలో, అణగారినవారి హక్కుల కోసం పోరాడే సమయంలో కూడా కనిపించాలి. స్వాతంత్ర్య సమరయోధులు మనకు కేవలం ఒక స్వతంత్ర దేశాన్ని ఇవ్వలేదు. మనమే మన భవిష్యత్తును నిర్మించుకోవాలనే బాధ్యతను కూడా ఇచ్చారు.

**అసలైన స్వాతంత్ర్యం ఎప్పుడు?**

ఒక పేద కుటుంబం తన పిల్లలను భయపడకుండా చదివించగలిగినప్పుడు.. ఒక యువకుడు తన అర్హతతో ఉద్యోగం పొందగలిగినప్పుడు.. ఒక రైతు తన పంటకు గిట్టుబాటు ధరతో ప్రశాంతంగా జీవించగలిగినప్పుడు.. ఒక కార్మికుడు తన శ్రమకు తగిన గౌరవం పొందినప్పుడు.. కులం, మతం, ప్రాంతం పేరుతో ఎవరూ వివక్షకు గురికానప్పుడు.. ప్రతి పౌరుడికి న్యాయం, గౌరవం, సమాన అవకాశాలు అందినప్పుడు.. అప్పుడే స్వాతంత్ర్యం సామాన్యుడి ఇంటి గడప దాటినట్టవుతుంది. ఈ ఆగస్టు 15న ఒక ప్రశ్నను మనమే మనల్ని అడుక్కుందాం.. "దేశం ఎంత అభివృద్ధి చెందింది?" అనే ప్రశ్నతో పాటు.. "ఈ దేశాన్ని నిర్మిస్తున్న సామాన్యుడి బతుకు ఎంత మారింది?" అనే ప్రశ్నకు కూడా సమాధానం వెతుకుదాం. స్వేచ్ఛను కాపాడుకుందాం.. సమానత్వం కోసం పోరాడుదాం.. సామాజిక న్యాయాన్ని సాధిద్దాం..ప్రతి మనిషి గౌరవంగా బతికే భారతదేశాన్ని నిర్మిద్దాం.అలాంటి లక్ష్యాలను సాధించగలిగినప్పుడే భారతదేశం ప్రతిష్టాత్మకంగా ముందుకు సాగగలదని దేశ అభివృద్ధి దేశ పురోగతి దేశంలోని పేద ప్రజలు అభివృద్ధి పథంలో నడవగలిగినప్పుడే సాధ్యమవుతుందన్న సంగతిని అందరం గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు.



# రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది









అక్రమాలపై నిలదీస్తే కేసులతో జైళ్లకు పంపుతున్నారు
ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టే ఇందుకు నిదర్శనం
వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం

**కర్నూలు,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో అమలువుతున్న 'రెడ్ బుక్ రాజ్యాంగం'పై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్, జైలుకు పంపిన తీరు రాష్ట్రంలో బాధితులే నిందితులుగా మారుతున్న దారుణ పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తూ, చివరకు ఎమ్మెల్యేల ఇళ్లను కూడా ధ్వంసం చేసి అరెస్టులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు డైరెక్షన్‌లోనే ఈ కుట్రల పాలన సాగుతోందని జగన్ విమర్శించారు. రాత్రి 2:45 గంటల సమయంలో వందల మంది పోలీసులు దొంగల్లా, బందిపోటు ముఠాలా వచ్చి ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటి డోర్లు, సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆయనను అపహరించుకుపోయారని ఆరోపించారు. పగటిపూట నోటీసులు ఇస్తే రాని ఉగ్రవాదా ఆయన అని ప్రశ్నించారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై మూడు అక్రమ కేసులు పెట్టడమే కాకుండా ఆయన కుమారుడు, తమ్ముడు, తమ్ముడి కుమారుడిని కూడా ఈ కేసుల్లో ఇరికించారని మండిపడ్డారు. ఆగష్టు 1న సంగాల గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గిరిపై దాడి జరుగుతుంటే, ఆయన రక్షణ కోసం ఎమ్మెల్యే విరూపాక్షి మానవత్వంతో అక్కడికి వెళ్లడమే నేరమన్నట్లు పోలీసులు వ్యవహరించారని జగన్ తెలిపారు. స్థానిక ఎస్సై, సీఐలకు ఫోన్ చేసినా పోలీసులు కాపాడక పోవడంతోనే ఎమ్మెల్యే స్వయంగా వెళ్లాల్సి వచ్చిందన్నారు. ఆ తర్వాత నెమకల్లు వద్ద ఎమ్మెల్యేపై దాడి చేసి, ఆయన తమ్ముడి చెయ్యి విరగ్గొట్టారని వెల్లడించారు. ఈ నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక టీడీపీ కార్యకర్త తన భార్య బట్టలు తానే చించి, ఆ నెపం ఎమ్మెల్యేపై నెట్టి ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా బయటకు వచ్చాయని, సదరు మహిళతో తప్పుడు మాటలు చెప్పిస్తూ ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్నారని, ఈ అక్రమాలపై ప్రజాస్వామ్యవాదులంతా ఆలోచించాలని జగన్ పిలుపునిచ్చారు.



# వాతావరణ మార్పులను తట్టుకునే వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన




**హసన్‌పర్తి, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని వ్యవసాయ అధికారులు సూచించారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం సిద్దాపూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఆత్మ పథకం కింద రికగ్నిషన్ ఆఫ్ ప్రియర్ లెర్నింగ్ (ఆర్పిఎల్) శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి అడ్లూరి అనురాధ ఆధ్వర్యంలో, సిద్దాపూర్ గ్రామ సర్పంచ్ బొక్క హరీష్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 'వాతావరణాన్ని తట్టుకునే వ్యవసాయ పద్ధతులు' అంశంపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాభావం, అధిక వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు, భూగర్భ జలాల తగ్గుదల వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనేందుకు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించడం, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచడం, పంటల వైవిధ్యీకరణ, నేల ఆరోగ్య పరిరక్షణ, ఎరువులను సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలను వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి మాట్లాడుతూ పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, ఇతర ఆరుతడి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని తెలిపారు. తక్కువ నీటితో సాగు చేయగల పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా వాతావరణ ప్రతికూలతలను అధిగమించడంతో పాటు ఆదాయాన్ని స్థిరంగా కొనసాగించవచ్చని పేర్కొన్నారు. తెలంగాణ కృషి వికాస కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నర్సయ్య మాట్లాడుతూ నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో అధిక నీటి అవసరం కలిగిన పంటలకు బదులుగా స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేయాలని సూచించారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుతూ ఆధునిక సాంకేతికతలను వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్ఎఫ్ఎన్ఎస్ఎం కన్సల్టెంట్ సారంగం ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, వాతావరణ అనుకూల వ్యవసాయ విధానాలు, ఆరుతడి పంటల సాగు, ఎరువుల సమర్థవంతమైన వినియోగంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాకేష్ రెడ్డి, పాక్స్ వంగపహాడ్ చైర్మన్ రాజేష్ గౌడ్, బైరాన్‌పల్లి సర్పంచ్ సురేందర్, అర్వపల్లి సర్పంచ్ ప్రభాకర్, ఏఈవోలు బిందు, శైలజ, సాయి, సుమన్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు. రైతులు అడిగిన సందేహాలకు అధికారులు సమాధానాలు అందించి, వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవడంపై మార్గనిర్దేశం చేశారు.

# టీబీ నిర్మూలనకు గూడూరులో ప్రత్యేక స్క్రీనింగ్
# 68 మందికి ఎక్స్‌రే, కఫం పరీక్షలు..

**ప్రజలకు వైద్య సిబ్బంది అవగాహన**



**కమలాపూర్, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

టీబీ ముక్త భారత్ అభియాన్ ఫేజ్--2లో భాగంగా కమలాపూర్ మండలంలోని గూడూరు గ్రామంలో గురువారం ఎక్స్‌రే, టీబీ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో టీబీ వ్యాధిని ముందస్తుగా గుర్తించి సకాలంలో చికిత్స అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ, చికిత్సపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. 14 సంవత్సరాలు పైబడిన వారు, వృద్ధులు, ధూమపానం, మద్యపానం చేసేవారు, హెచ్ఐవీ బాధితులు, బీఎంఐ తక్కువగా ఉన్నవారు, గతంలో టీబీతో బాధపడి కోలుకున్నవారు, వారి సన్నిహితులను గుర్తించి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 68 మందికి ఎక్స్‌రేతో పాటు కఫం (తెమడ) పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ--టీబీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ రెడ్డి మాట్లాడుతూ టీబీ వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స పొందితే పూర్తిగా నయం చేసుకోవచ్చున్నారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి తగ్గడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీబీ నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు. పల్లె దవాఖాన వైద్యురాలు మాధవి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో టీబీపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అనుమానితులను ముందుగానే గుర్తించి పరీక్షలు నిర్వహించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. టీబీ నిర్ధారణ అయిన వారు వైద్యుల సూచన మేరకు మందులను క్రమం తప్పకుండా తీసుకుంటే వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ మాధవరెడ్డి, హెచ్ఈఓ రవీందర్, ఎస్టీఎస్ శ్రీనివాస్, రేడియోగ్రాఫర్లు మహేష్, సదానందం, సిద్ధార్థ, ల్యాబ్ టెక్నీషియన్ చందు, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్ రవీందర్, ఏఎన్ఎంలు రమాదేవి, లావణ్య, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో నూతన కాకతీయ క్యాంటీన్ ప్రారంభం

**విద్యార్థులు, సిబ్బందికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాలి : ఎమ్మెల్యే నాయిని**




**హనుమకొండ, 13 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

సుబేదారి ఆర్ట్స్ కాలేజీలో నూతనంగా ఏర్పాటు చేసిన కాకతీయ క్యాంటీన్‌ను వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్ నిర్వాహకులు దూలం క్రాంతికుమార్ గౌడ్, సుదర్శన్‌ను ఎమ్మెల్యే అభినందించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందిస్తూ క్యాంటీన్‌ను విజయవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. క్యాంటీన్ అందుబాటులోకి రావడంతో కళాశాల విద్యార్థులు, సిబ్బందికి మెరుగైన ఆహార సదుపాయం అందుబాటులోకి వచ్చిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నాణ్యత, పరిశుభ్రత విషయంలో రాజీ పడకుండా క్యాంటీన్ నిర్వహణ కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుదర్శన్, పీజీ కాలేజీ ప్రిన్సిపాల్ నిర్మల, నాన్-టీచింగ్ ఎన్జీవో అధ్యక్షుడు, సుబేదారి యూనిట్ శ్రీ రాజు నాయక్, ఆర్ట్స్ కాలేజీ టీచింగ్ ఫ్యాకల్టీ క్లబ్ చైర్మన్ డాక్టర్ భిక్షపతి, అధ్యాపకులు, నాన్-టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయ డైరీ పునరుద్ధరణకు చర్యలు




**హన్మకొండ, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

విజయ డైరీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు త్వరలోనే చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. పాడి రైతులకు అండగా నిలిచి పాల ఉత్పత్తిని పెంచడంతో పాటు ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాలను అందించేందుకు విజయ డైరీని మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం విజయ డైరీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. పాల సేకరణ కేంద్రం, శీతలీకరణ కేంద్రం, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్లు, పాల నాణ్యత పరీక్షించే ప్రయోగశాలను పరిశీలించారు. పాల సేకరణ, నాణ్యతా ప్రమాణాలు, ప్రాసెసింగ్, పాల ఉత్పత్తుల తయారీపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాడి రైతుల సంక్షేమ సంఘం సభ్యులు, రైతులు, బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పశు పోషణ ద్వారా రైతులు వ్యవసాయంతో పాటు నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. నాణ్యమైన పశువులను ఎంపిక చేసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. విజయ డైరీతో పశుసంవర్ధక శాఖను అనుసంధానం చేసి రైతులకు ఆధునిక పశుపోషణ పద్ధతులు, పశువైద్య సేవలు, పాల ఉత్పత్తి పెంపుపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. విజయ డైరీలో నెయ్యి, పన్నీరు తదితర పాల ఉత్పత్తులను విస్తృతంగా తయారు చేసేలా ఆధునిక యంత్రాలు, మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రసాయనాలు కలపకుండా స్వచ్ఛమైన పాలను అందించేందుకు డైరీ చేస్తున్న కృషిని కలెక్టర్ అభినందించారు. విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ ధనరాజ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం రోజుకు సుమారు 6 వేల లీటర్ల పాలను ప్రాసెసింగ్ చేస్తున్నామని తెలిపారు. 26 సొసైటీల ద్వారా పాలను సేకరిస్తున్నామని, పాల సేకరణ తగ్గడంతో ఉత్పత్తి సామర్థ్యం కూడా తగ్గిందన్నారు. రైతులను పాడి పరిశ్రమ వైపు ప్రోత్సహించి రోజుకు 15 వేల లీటర్ల పాల సేకరణ లక్ష్యాన్ని చేరుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాకతీయ విజయ డైరీ సొసైటీ చైర్మన్ ఎరువు దేవేందర్, కమిటీ సభ్యులు సమ్మయ్య, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ చైతన్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ సత్యసాయి, పాడి రైతులు, డిస్ట్రిబ్యూటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఉద్యమ బాట

**పీఆర్సీ ప్రకటించి డీఏలు మంజూరు చేయాలి: తహసీల్దార్‌కు మెమోరాండం**



**హసన్‌పర్తి, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యూఎస్పీసీ ఆధ్వర్యంలో గురువారం హసన్‌పర్తి మండల తహసీల్దార్‌కు మెమోరాండం సమర్పించారు. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు. యూటీఎఫ్, డీటీఎఫ్, టీపీటీఎఫ్, టీటీయూ తదితర సంఘాల నాయకులు, కార్యకర్తలు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు సమిష్టిగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు సంబంధించిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులు తమ విధులను అంకితభావంతో నిర్వహిస్తున్నప్పటికీ వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో జాప్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాలు, ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించాలని నాయకులు కోరారు. సమస్యల పరిష్కారంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షురాలు రమాదేవి, ప్రధాన కార్యదర్శి టి. నరేష్, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు టి. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రామచంద్రు, టీటీయూ మండల అధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు అనిల్, భార్గవి తదితరులు పాల్గొన్నారు. అలాగే డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డాక్టర్ మోడెం సారంగపాణి, జిల్లా ఉపాధ్యక్షురాలు బి. అంజనీదేవి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సారంగపాణి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని వెంటనే పీఆర్సీని ప్రకటించి, డీఏలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు సమర్పించిన మెమోరాండాన్ని సంబంధిత అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటనకు మేడారం ముస్తాబు





**ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి**
**మేడారం ఆలయ తుది దశ అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి**
**సమ్మక్క-సారలమ్మ సన్నిధి నుంచి ఒంటరి, వితంతు మహిళల పింఛన్ల పంపిణీకి శ్రీకారం**
**మంత్రి దనసరి అనసూయ సీతక్క**

**ములుగు జిల్లా/మేడారం, 13 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 16న మేడారంలో పర్యటించనున్న నేపథ్యంలో ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయాలని, ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సమ్మక్క--సారలమ్మ వనదేవతల సన్నిధి నుంచి అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. గురువారం మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి మేడారంలోని సమ్మక్క--సారలమ్మ వనదేవతల ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి పెండింగ్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే రెండుసార్లు మేడారం ప్రాంగణాన్ని సందర్శించి సమ్మక్క--సారలమ్మ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన నిధులను సమకూర్చి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పాటు మహాజాతరకు ముందు కుటుంబ సమేతంగా మేడారానికి వచ్చి వనదేవతలను దర్శించుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రివర్గ సహచరులతో కలిసి మేడారంలో బస చేసి ములుగు జిల్లా అభివృద్ధికి అవసరమైన నిధులను కేటాయించారని తెలిపారు. ఈ నెల 16న ముఖ్యమంత్రి మరోసారి మేడారానికి రానున్న నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో మిగిలిన తుది దశ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి భవిష్యత్తులో చేపట్టాల్సిన విస్తరణ, అభివృద్ధి పనులపై సూచనలు, సలహాలు, ఆదేశాలు ఇవ్వనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆలోచనలు, మార్గదర్శకత్వానికి అనుగుణంగా మేడారాన్ని మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మేడారానికి వచ్చే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులకు ములుగు జిల్లా, నియోజకవర్గ ప్రజల తరఫున ఘన స్వాగతం పలుకుతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి మేడారం ఆలయ ప్రాంగణంలో పర్యటించనున్న నేపథ్యంలో భక్తులు, స్థానిక ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని తెలిపారు. వనదేవతలను దర్శించుకున్న అనంతరం సమ్మక్క--సారలమ్మ సన్నిధి నుంచే అర్హులైన ఒంటరి, వితంతు మహిళలకు పింఛన్లు అందించే కార్యక్రమానికి ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారని మంత్రి వివరించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని సంతృప్తి స్థాయిలో అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆగస్టు 31వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించి, అర్హులను గుర్తించి పింఛన్లు అందించాలన్నది ముఖ్యమంత్రి ఆలోచనగా పేర్కొన్నారు. సమ్మక్క--సారలమ్మ తల్లుల దీవెనలతో ప్రతి మహిళ సంతోషంగా, ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని వారి సన్నిధి నుంచే ప్రారంభిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏటూర్‌నాగారం ఏఎస్పీ మనన్ భట్, జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, గుత్తేదారులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ జర్నలిస్టులకు ప్రత్యేక జీఓ ద్వారా ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలి

**అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ**




**భద్రాద్రి కొత్తగూడెం, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ప్రత్యేక జీఓ తీసుకువచ్చి ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా(డబ్ల్యూజెఐ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 90 శాతానికి పైగా ఏజెన్సీ ప్రాంతంగా ఉందని, జిల్లాలో సుమారు 1,225 మంది జర్నలిస్టులు వివిధ పత్రికలు, న్యూస్ ఛానళ్లలో విధులు నిర్వహిస్తున్నారని డబ్ల్యూజెఐ ప్రతినిధులు తెలిపారు. ఏజెన్సీ చట్టాలను సాకుగా చూపుతూ జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించకుండా ఉండటం వారి కనీస హక్కులను హరించడమేనని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, 2బీహెచ్‌కే, 3బీహెచ్‌కే గృహ పథకాలలో చేర్చాలని కోరారు. ఏజెన్సీ చట్టాల పేరుతో ఈ అంశాన్ని వాయిదా వేయకుండా జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా జీఓ తీసుకువచ్చి ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు. అక్రిడిటేషన్ కలిగిన జర్నలిస్టులందరికీ రూ.5 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యంతో పాటు క్యాష్‌లెస్ వైద్య చికిత్స అందించేలా హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. 60 సంవత్సరాలు దాటిన సీనియర్ జర్నలిస్టులకు నెలకు రూ.10 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, విధి నిర్వహణలో జర్నలిస్టు మరణిస్తే వారి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడులు జరిగిన సందర్భాల్లో పోలీసులు వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి మండల కేంద్రంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ భవనాలను నిర్మించాలని, చిన్న పత్రికలు, వెబ్ పోర్టళ్లకు కూడా ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కన్వీనర్ మొబగాపు ఆనంద్ కుమార్, సంయుక్త కన్వీనర్ తోకల నాగేశ్వరరావు, కో-కన్వీనర్ కే. దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పకడ్బందీగా అమలు చేయాలి

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై స్పాట్ ఫైన్లు.. వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలకు జియోట్యాగింగ్**
**అధికారులను ఆదేశించిన హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి**

**హన్మకొండ, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**



హన్మకొండ జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, జీడబ్ల్యూఎంసీ, మున్సిపాలిటీల పరిధిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిబంధనలు-2026ను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హన్మకొండ ఐడీఓసీ కార్యాలయంలో ఘన వ్యర్థాల నిర్వహణపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలో ఇప్పటివరకు 42 గ్రామ పంచాయతీలను గుర్తించినట్లు డీపీఓ వివరించగా, ఆయా గ్రామ పంచాయతీల్లో నాలుగు బిన్నుల విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తడి, పొడి, శానిటరీ, హానికర/ప్రత్యేక సంరక్షణ అవసరమైన వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి సేకరించాలని సూచించారు. రోజుకు 50 నుంచి 100 కిలోల వరకు వ్యర్థాలు ఉత్పత్తి చేసే బల్క్ వేస్ట్ జనరేటర్లను గుర్తించి నమోదు చేయాలని, వారి వద్దే తడి వ్యర్థాలను కంపోస్టింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన పొడి వ్యర్థాలను గ్రామ పంచాయతీ ట్రాక్టర్లు లేదా ఆటో ట్రాలీల ద్వారా సేకరించి శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెస్ చేయాలని తెలిపారు. శానిటరీ, ప్రత్యేక సంరక్షణ అవసరమైన వ్యర్థాలను సమీపంలోని బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ఏజెన్సీలకు అప్పగించేలా ఎంఓయూలు కుదుర్చుకుని శాస్త్రీయ పద్ధతిలో ప్రాసెసింగ్ చేయించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై స్పాట్ ఫైన్లు విధించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ సమాఖ్యల ఆధ్వర్యంలో బర్తన్ బ్యాంకులు ఏర్పాటు చేసి, ఫంక్షన్ హాళ్లలో స్టీల్, ఇతర పునర్వినియోగ వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. త్వరలో జరగనున్న గణేష్ ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీలతో ముందస్తు సమావేశాలు నిర్వహించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించి పునర్వినియోగ వస్తువులను ఉపయోగించేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలోని తడి, పొడి వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలకు జియోట్యాగింగ్ చేయాలని ఆదేశించారు. దేవాలయాల నుంచి వచ్చే కొబ్బరి చిప్పలు, పూల వ్యర్థాలను గుర్తించి, వాటితో ఉపయోగకరమైన ఉత్పత్తులను తయారు చేసే వినూత్న విధానాలను ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో చెత్త పేరుకుపోయే ప్రదేశాలు లేకుండా పరిశుభ్రతను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ, పరకాల మున్సిపాలిటీ పరిధిలోనూ నాలుగు బిన్నుల విధానం, ఇంటింటి చెత్త సేకరణ, బల్క్ వేస్ట్ జనరేటర్ల నిర్వహణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, వ్యర్థాల శాస్త్రీయ ప్రాసెసింగ్ తదితర చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన హన్మకొండ జిల్లాను నిర్మించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, ఇన్‌చార్జ్ కలెక్టర్ శేషాద్రి, జిల్లా పంచాయతీ అధికారి, కాలుష్య నియంత్రణ మండలి అధికారి సునీత, జీడబ్ల్యూఎంసీ, పరకాల మున్సిపాలిటీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





**అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు అందిస్తాం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**హసన్‌పర్తి, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. హసన్‌పర్తి మండలం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని అమిత్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన "మహిళా ఉన్నతి--తెలంగాణ ప్రగతి" కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గ్రేటర్ వరంగల్ 1వ డివిజన్‌కు చెందిన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు, నూతన రేషన్ కార్డుల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని అన్నారు. ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన, విద్యా, సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 1వ డివిజన్ అధ్యక్షుడు చిర్ర రాము, 55వ డివిజన్ అధ్యక్షుడు గడ్డం అరుణ్, 56వ డివిజన్ అధ్యక్షుడు కొంకా హరిబాబు, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, మార్కెట్ డైరెక్టర్ రైతు రాజు, పిఏసీఎస్ చైర్మన్ గోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు విసం సురేందర్ రెడ్డి, వెంకన్న, కనుపర్తి కిరణ్, రవి యాదవ్, నాయకులు, మహిళలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

**హైదరాబాద్,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు.

# బీసీల పిడికిలి - సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**ఈ నెల ఆగస్ట్ 18 న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి సందర్భంగా...**

**కవికలం జై భీమ్ న్యూస్:-**

భారతీయ తొలి
బహుజన చక్రవర్తి
ప్రపంచ ప్రఖ్యాత వీరుడు
విదేశీయులచే కీర్తించబడిన
భారతీయ రాబిన్ హుడ్ గా
కీర్తించబడిన దక్కన్ రాజు
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.....

తెలుగు నేల వీరుడై...
భారతమాత ముద్దుబిడ్డవై...
అణగారిన వర్గాల బందుకువై
పాపన్నా! నీవు వెలిగించిన
పోరాట జ్వాల
నేటికీ మా గుండెల్లో
మండుతూనే ఉంది....

కులం కాదు నీ బలం
కత్తి కాదు నీ ధైర్యం
ప్రజలే నీ సైన్యమై
స్వాభిమానమే నీ ఆయుధమై
అన్యాయంపై
సమరశంఖం పూరించావు....

ఎక్కడైతే చట్టంచే
సామాన్యుడి గొంతు
నొక్కబడుతుందో
ఎక్కడైతే న్యాయం
పాలకుల పాదాల కింద
బందీ అవుతుందో
అక్కడే ధీటైన ధిక్కారం పుడుతుంది
ఆ ధిక్కార పిడికిలి
సర్ధార్ సర్వాయి పాపన్న....

ఎత్తైన కోటలు, దౌర్జన్య పూరిత
సామ్రాజ్యాలను చూసి
అతను భయపడలేదు
తనను నమ్ముకున్న ప్రజలు
నేలతల్లి నమ్మకం కాపాడుకోవడానికి
గుండెబలంతో నిరంకుశ
సామ్రాజ్యల పునాదులను
బలంగా ఢీకొట్టాడు....

గౌడ గడపలో పుట్టి
తెలంగాణ గడ్డపై ఎదిగి
అణగారిన ప్రజల హక్కుల కోసం
రాజ్యాధికారాన్ని సైతం సవాల్ చేసిన
సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్.....

సింహాసనాల మీద
కూర్చున్న వాడిదే
శాశ్వత రాజ్యం కాదు
మట్టిని నమ్ముకున్న వాడికి కూడా
పోరాడితే రాజ్యాధికారం
దక్కుతుందని నిరూపించిన
బహుజన ఆత్మగౌరవ ప్రతీక
అతడు....

పేదవాడి కన్నీటిని చూసి
నీ గుండె కరిగింది
బలహీనుడి బాధను చూసి






నీ పిడికిలి బిగిసింది
ప్రజల గౌరవం కోసం
నీ ప్రాణాన్నే పణంగా పెట్టావు....

బీసీ బిడ్డలారా
పాపన్న అడుగుజాడల్లో నడుద్దాం
ఆత్మగౌరవాన్ని కాపాడుదాం
విద్యను ఆయుధంగా చేసుకుందాం
ఐక్యతను బలంగా మార్చుకుందాం
అవకాశాల కోసం పోరాడుదాం
పాపన్న చూపిన బాటలో
ప్రతి బీసీ బిడ్డ ఎదగాలి......

ప్రతి ఇంటా విద్యా దీపం వెలగాలి
ప్రతి చేతిలో ఉద్యోగం ఉండాలి
ప్రతి హృదయంలో ఆత్మగౌరవం నిండాలి
సామాజిక న్యాయం కోసం
మన గళం గర్జించాలి.....

సమాన అవకాశాల కోసం
మన అడుగు ముందుకు పడాలి
బీసీల భవిష్యత్తు కోసం
మనమంతా ఒక్కట్వాలి.....

నీ చరిత్ర ఒక గతం కాదు
మా భవిష్యత్తుకు
దారి చూపే దీపం
నీ వీరత్వం మా స్ఫూర్తి
నీ పోరాటం మా ప్రేరణ
నీ ఆత్మగౌరవం మాకు ఆదర్శం
నీ పేరు మా గుండెల్లో
చిరస్థాయిగా ఉంటుంది.....

డా. చిర్ర రాజు గౌడ్.
రాష్ట్ర బీసీ జేఏసీ కన్వీనర్
కే.యూ పాలక మండలి సభ్యులు.
బి.ఓ.ఎస్ చైర్మన్ తెలుగు విభాగం.
9849217566.

# పర్యావరణ పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి

**ప్రభుత్వం-విద్యాసంస్థలు-పరిశ్రమలు-పరిశోధకుల భాగస్వామ్యంతోనే సుస్థిర అభివృద్ధి**
**కాకతీయ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు**




**కేయూ క్యాంపస్, 13 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం, విద్యాసంస్థలు, పరిశ్రమలు, పరిశోధకులు సమన్వయంతో పనిచేయడం అత్యంత కీలకమని తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి జి. రవి, ఐఏఎస్ అన్నారు. పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా పర్యావరణ సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలు చూపే దిశగా సాగాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయ స్వర్ణోత్సవాల్లో భాగంగా విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగం, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర నిపుణుల మదింపు కమిటీ, తెలంగాణ కాలుష్య నియంత్రణ అప్పీలేట్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో సెనెట్ హాల్‌లో నిర్వహించిన "సుస్థిర అభివృద్ధి కోసం సంస్థల సమన్వయం: కాలుష్య నియంత్రణకు వ్యూహాత్మక, బహుళ భాగస్వామ్య విధానం" అనే రెండు రోజుల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమానికి తెలంగాణ కాలుష్య నియంత్రణ అప్పీలేట్ అథారిటీ సభ్యుడు ఆచార్య గాదె దయాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జి. రవి మాట్లాడుతూ పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధి పర్యావరణ పరిరక్షణతో సమన్వయం కావాలని అన్నారు. వాయు, జల, భూ కాలుష్యాలపై నిరంతర పర్యవేక్షణతో పాటు పర్యావరణ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలు కలిసి పరిశుభ్రమైన ఉత్పత్తి విధానాలు, సమర్థవంతమైన పర్యావరణ అనుసరణ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని సూచించారు. సదస్సులో జరిగిన చర్చలు, పరిశోధనలు శాస్త్రీయ పరిధికే పరిమితం కాకుండా విధాన రూపకల్పన, ఆచరణాత్మక పరిష్కారాలకు దోహదపడాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ రంగంలో యువతకు అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. హైదరాబాద్ పరిసరాల్లో 500కు పైగా బల్క్ డ్రగ్ కంపెనీలు, 12 వేలకు పైగా పరిశ్రమలు ఉన్నందున పర్యావరణ ప్రమాణాల అమలు మరింత కీలకమని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టాలని, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణలో కాకతీయ విశ్వవిద్యాలయం ఆదర్శ వేదికగా నిలవాలని ఆకాంక్షించారు.

**కాలుష్య నియంత్రణకు పటిష్ట పర్యవేక్షణ అవసరం**

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మాజీ సభ్య కార్యదర్శి డా. బి. సేన్‌గుప్తా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాట్లాడుతూ దేశంలో కాలుష్య నియంత్రణకు పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థలు, నిబంధనల కఠిన అమలు అవసరమన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే మురుగునీటిలో కేవలం 38 నుంచి 40 శాతం మాత్రమే శుద్ధి అవుతోందని తెలిపారు. 296 నదీ ప్రాంతాలు కాలుష్యానికి గురవుతున్నాయని, పరిశ్రమలు, విద్యుత్ కేంద్రాలు, వాహనాల కాలుష్యం కారణంగా 132 నగరాలు తీవ్ర కాలుష్యాన్ని ఎదుర్కొంటున్నాయని వివరించారు. ఉత్తర భారతదేశంలో శీతాకాల వాతావరణ పరిస్థితులు కాలుష్యకారకాలను వాతావరణంలో నిలిపివేయడంతో స్మాగ్ తీవ్రత పెరుగుతోందన్నారు. కాలుష్య పర్యవేక్షణ పరికరాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయడంతో పాటు చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. విద్యుత్ వాహనాల వినియోగం, పారిశ్రామిక నీటి పునర్వినియోగాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలోని ఔషధ పరిశ్రమలు విషపూరిత ఉద్గారాలు, ప్రమాదకర వ్యర్థాల నియంత్రణపై తక్షణ చర్యలు చేపట్టి పర్యావరణహిత సాంకేతికతలను అవలంబించాలని కోరారు.

**సమగ్ర పర్యావరణ అంచనాతోనే సుస్థిర అభివృద్ధి**

సదస్సు జాయింట్ సెక్రటరీ ఆచార్య పి. వెంకటేశ్వర్ రావు 'పర్యావరణ అనుకూల ప్రక్రియ' అంశంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. సుస్థిర అభివృద్ధికి వాయు, శబ్ద, జల, జీవ, భూ పర్యావరణాలపై సమగ్ర అధ్యయనం అవసరమన్నారు. పరిశ్రమలు, అభివృద్ధి ప్రాజెక్టుల ప్రభావాలను అంచనా వేసేటప్పుడు సామాజిక, ఆర్థిక, ఆరోగ్య, ప్రమాద ప్రభావాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ అంచనాల ఆధారంగా సమర్థవంతమైన పర్యావరణ నిర్వహణ ప్రణాళిక రూపొందించి, కాలుష్య నియంత్రణ చర్యలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. రెండు రోజుల జాతీయ సదస్సులో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణపై విస్తృత సాంకేతిక ఉపన్యాసాలు, ప్యానల్ చర్చలు నిర్వహించారు. విద్యార్థులు, పరిశోధకులు ఉత్సాహంగా పాల్గొని నిపుణులతో ప్రశ్నోత్తరాల్లో పాల్గొన్నారు. సదస్సు ద్వారా పరిశోధన, విధానం, ఆచరణ మధ్య సమన్వయానికి ప్రాధాన్యత లభించింది. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ దినేష్, పాఠ్య ప్రణాళిక అధ్యక్షురాలు ఆచార్య టి. సవితా జ్యోత్స్నతో పాటు పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి

**యువత భారీగా తరలిరావాలి: యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్**



**ఆత్మకూరు, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ఈ నెల 16న పరకాల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పరకాల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మాదాసి శ్రీధర్ పిలుపునిచ్చారు. గురువారం ఆత్మకూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన పరకాల నియోజకవర్గాన్ని ఆదర్శంగా అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని కోరారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల అనంతరం నిర్వహించే భారీ బహిరంగ సభకు యువజన సంఘాలు, మహిళా సంఘాలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని శ్రీధర్ కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు సభ విజయవంతానికి యువత శక్తివంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సభను ప్రతిష్టాత్మకంగా తీసుకొని భారీ ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్యే సూచనల మేరకు యువత ముందుండి సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు రేవూరి జయపాల్‌రెడ్డి, వార్డు సభ్యుడు బయ్యా కుమారస్వామి, ఏఎంసీ డైరెక్టర్ కాడబోయిన రమేష్, నియోజకవర్గ బీసీ సెల్ కోఆర్డినేటర్ చిమ్మని దేవరాజు, గ్రామ అధ్యక్షులు తాళ్ల కిరణ్, ఎలగొండ లింగమూర్తి, మాజీ సభ్యుడు కాడబోయిన రవి, యూత్ నాయకులు కాడబోయిన రాజకుమార్, మహమ్మద్ కరీం, షరీఫ్, కాంగ్రెస్ నాయకులు తిరుపతి, మొగిలి, బయ్యా సురేష్, ఎలగొండ రాజు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై అఘాయిత్యం.. నిందితుడి అరెస్ట్


**బెదిరించి పలుమార్లు లైంగిక దాడి.. బాలిక గర్భం దాల్చడంతో వెలుగులోకి**

**వరంగల్, 13 ఆగస్టు 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

మట్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడి గర్భవతిని చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో నిందితుడిని మట్వాడ పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలి తల్లి ప్రైవేట్ రంగంలో పనిచేస్తుండగా, కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో తన ముగ్గురు కుమార్తెలతో కలిసి ఓ వ్యక్తితో సహజీవనం సాగిస్తోంది. పిల్లల చదువు, కుటుంబ బాధ్యతలను సదరు వ్యక్తి చూసుకునేవాడు. సుమారు మూడేళ్ల క్రితం బాలికను బాలికల వసతి గృహంలో చేర్పించారు. 2025 జూన్‌లో నిందితుడు తల్లికి తెలియకుండా వసతి గృహానికి వెళ్లి బాలికను తన వెంట తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం బాలికపై లైంగిక దాడికి పాల్పడి, విషయం బయటకు చెబితే కుటుంబ సభ్యులను చంపేస్తానని బెదిరించినట్లు పేర్కొన్నారు. దీంతో భయపడిన బాలిక ఈ విషయాన్ని ఎవరికీ చెప్పలేకపోయిందని తెలిపారు. ఆ తర్వాత కూడా పలుమార్లు బాలికను వసతి గృహం నుంచి తీసుకువచ్చి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు వెల్లడించారు. ఇటీవల బాలిక అనారోగ్యానికి గురై కడుపునొప్పితో బాధపడుతుండటాన్ని తల్లి గమనించి ప్రశ్నించడంతో అసలు విషయం బయటపడింది. బాలిక జరిగిన ఘటనను తల్లికి చెప్పడంతో వైద్య పరీక్షలు నిర్వహించగా గర్భం దాల్చినట్లు నిర్ధారణ అయింది. దీంతో తల్లి ఫిర్యాదు మేరకు మట్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా భరోసా కేంద్రం ద్వారా బాలిక ప్రకటనను వీడియో రికార్డింగ్ చేసి, వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వాహన తనిఖీల సమయంలో పారిపోయేందుకు ప్రయత్నించిన నిందితుడు సంగాల విజయ్‌కుమార్ (38)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నేరానికి ఉపయోగించిన పల్సర్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై బిఎన్ఎస్ సెక్షన్లు 65(1), 64(2)(ఎం), 64(2)(ఎఫ్), 351(2)తో పాటు పోక్సో చట్టంలోని సెక్షన్లు 5(ఎల్), 5(ఎన్) ఆర్/డబ్ల్యూ 6 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరచగా 15 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. బాధితురాలి గోప్యత, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆమె పేరు, కుటుంబ సభ్యుల వివరాలు, నివాస ప్రాంతం తదితర గుర్తింపునకు దారితీసే వివరాలను పోలీసులు వెల్లడించలేదు.

# ఉచిత కుట్టుమిషన్ల పథకాన్ని ప్రారంభించిన మంత్రి పొన్నం

**హైద్రాబాద్, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**




తెలంగాణలో బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సచివాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదిగి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ పథకం కింద రాష్ట్రవ్యాప్తంగా 1,19,000 కుట్టుమిషన్లను అర్హులైన బీసీ మహిళలకు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఒక్కో ఆటోమేటిక్ కుట్టుమిషన్ విలువ రూ.12,000 కాగా, 100 శాతం సబ్సిడీపై ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన బీసీ మహిళల నుంచి ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.

# సీపీఐ పాదయాత్ర 5వ రోజు అన్నారం షరీఫ్‌లోకి ప్రవేశం

ప్రజా సమస్యలపై ఇంటింటి ప్రచారం.
మత సామరస్యాన్ని కాపాడాలని పిలుపు



**అన్నారం, 13 ఆగస్టు 2026 ( జై భీమ్ న్యూస్)**

కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో కొనసాగుతున్న పాదయాత్ర ఐదో రోజుకు చేరుకుంది. గురువారం పాదయాత్ర పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్‌లోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాదయాత్రలో భాగంగా నాయకులు అన్నారం షరీఫ్ మార్కెట్‌లో వ్యాపారులు, చిరు వ్యాపారులు, కూలీలు, సామాన్య ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలు, నిరుద్యోగం, రైతులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యా--వైద్య రంగాల్లో పెరుగుతున్న ప్రైవేటీకరణ తదితర అంశాలపై ప్రజలతో చర్చించారు.

### ప్రజల ఐక్యతే దేశానికి బలం

ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డా. సయ్యద్ వలీ ఉల్లా క్వాద్రి మాట్లాడుతూ భారతదేశ బలం ప్రజల ఐక్యతలోనే ఉందన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు తదితర అన్ని వర్గాల ప్రజలు పరస్పర గౌరవం, సోదరభావంతో కలిసి జీవిస్తున్న దేశంగా భారతదేశానికి గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. మతం, భాష, ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టిస్తే దాని ప్రభావం చివరకు సామాన్య ప్రజలపైనే పడుతుందని అన్నారు. ప్రజల మధ్య ఐక్యత, సామరస్యం, సోదరభావాన్ని కాపాడటం ప్రజాస్వామ్యానికి అత్యంత ముఖ్యమని తెలిపారు. మత సామరస్యాన్ని దెబ్బతీసే ఎలాంటి ప్రయత్నాలనైనా ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రశ్నించాలని పిలుపునిచ్చారు.

### ప్రజా సమస్యలపై రాజకీయ చర్చ అవసరం

దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతులు--కార్మికుల సమస్యలు, విద్యా--వైద్య రంగాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాజకీయ చర్చ జరగాల్సిన అవసరం ఉందని డా. క్వాద్రి అన్నారు. ప్రజల జీవనోపాధి, ఉద్యోగాలు, విద్య, వైద్యం, సామాజిక భద్రత వంటి మౌలిక అంశాలకు రాజకీయ పార్టీలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆగస్టు 9 నుంచి 14వ తేదీ వరకు సీపీఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పాదయాత్రలో భాగంగా గ్రామాలు, మండల కేంద్రాలు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రజలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుంటున్నామని నాయకులు తెలిపారు. ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### సెప్టెంబర్ 1న 'చలో ఢిల్లీ'కి పిలుపు

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 1న ఢిల్లీలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన అంశాలను ప్రజలకు వివరించారు. రైతులు, కార్మికులు, యువత, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలపై దేశవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, సీపీఐ అసిస్టెంట్ కార్యదర్శి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రమేష్, బద్రి, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్ ప్రారంభించిన మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

సంక్షేమ పథకాలకు అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



**అమరావతి, 13 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

ఎస్సీ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను వినియోగించుకుని అర్హులైన వారు ఆయా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. గురువారం తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో మంత్రి అధికారిక వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. వెబ్‌సైట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన వివిధ బ్యాంకింగ్, సంక్షేమ పథకాల పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచారు. ఆయా పథకాల అర్హతలు, రుణ పరిమితి, సబ్సిడీ వివరాలతో పాటు సులభంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధంగా వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఎస్సీలకు విద్య, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ వెబ్‌సైట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివిధ బ్యాంకింగ్, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

### నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో ఉపాధి అవకాశాలు

నర్సింగ్ విద్యార్థులకు విశాఖపట్నం, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా ఒక్కో కేంద్రంలో 50 మంది చొప్పున ఇంగ్లిష్ భాషలో ప్రావీణ్యం కోసం ఉచిత శిక్షణ అందించి ఇజ్రాయెల్‌లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం ఎస్సీ కార్పొరేషన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి కేంద్రాలుగా నర్సింగ్ విద్యార్థులకు జర్మన్ భాషలో ఉచిత శిక్షణ అందించి జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.

### నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ

నిరుద్యోగ ఎస్సీ యువతకు వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఔత్సాహికులు ఎస్సీ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్‌ను వినియోగించుకుని తమకు అర్హత ఉన్న సంక్షేమ, ఉపాధి పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ, మాల కార్పొరేషన్ చైర్మన్లు ఉండవల్లి శ్రీదేవి, పెదపూడి విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం. నాయక్, ఎస్సీ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ పెండింగ్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలి

కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేసిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య



**న్యూఢిల్లీ, 13 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

వరంగల్‌లో కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం (సీజీహెచ్‌ఎస్) వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను త్వరితగతిన మంజూరు చేసి, మిగిలిన ప్రక్రియను పూర్తి చేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కోరారు. ఈ మేరకు గురువారం న్యూఢిల్లీలో కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వరంగల్, పరిసర ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సీజీహెచ్‌ఎస్ వైద్య సేవలపై ఆధారపడి ఉన్నారని ఎంపీ వివరించారు. వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవల కోసం 350 కిలోమీటర్లకు పైగా దూరం ప్రయాణించాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, పెన్షనర్లు తరచూ వైద్య సేవలు అవసరమైన సందర్భాల్లో ఇంత దూరం ప్రయాణించడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. స్థానికంగానే సీజీహెచ్‌ఎస్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తే వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు.

### ఆర్థిక అనుమతుల కోసం పెండింగ్‌లో ప్రతిపాదన

వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదన ప్రస్తుతం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో ఆర్థిక అనుమతుల కోసం పెండింగ్‌లో ఉందని డాక్టర్ కడియం కావ్య తెలిపారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు భవనానికి సంబంధించిన ఫెయిర్ రెంట్ అసెస్‌మెంట్ ఇప్పటికే పూర్తయిందని, అద్దె ఫైల్‌కు ఆల్ ఇండియా రేడియో సీఈఓ ఆమోదం కూడా లభించిందని వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అనుమతులను వెంటనే మంజూరు చేసి, మిగిలిన అధికారిక ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శిని ఎంపీ కోరారు. వరంగల్‌లో సీజీహెచ్‌ఎస్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని, దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తొలగుతాయని డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను మరింత అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ






**వరంగల్, 13 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను మరింత మెరుగుపరిచి, విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్ గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌ను గురువారం ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు సందర్శించి విద్యార్థులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కను నాటారు. ఈ సందర్భంగా కేఆర్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించి, అన్ని సౌకర్యాలతో కూడిన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదువుకుని దేశానికి వెన్నెముకగా ఎదగాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రభుత్వం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కూడా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 65వ డివిజన్ అధ్యక్షుడు సునీల్, ఎల్లాపూర్ గ్రామ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపతి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాకేష్ రెడ్డి, మండల అధ్యక్షుడు అశోక్, మాజీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ అరుణ, భిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు రామ్ రెడ్డి, 66వ డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్, మహిళా ఉపాధ్యక్షురాలు స్వాతి, మాజీ ఎంపీటీసీ సుదర్శన్, సీనియర్ నాయకులు ప్రకాష్, మధుసూదన్ రెడ్డి, కుమారస్వామి, అశోక్‌తో పాటు పలువురు నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజాయితీకి నిలువెత్తు పురస్కారం

డాక్టర్ మంథని శంకరయ్యకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నవల పురస్కారం



**కేయూ క్యాంపస్, 13 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగంలో గత 16 సంవత్సరాలుగా పీజీ, యూజీ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధిస్తున్న డాక్టర్ మంథని శంకరయ్య రచించిన 'జక్కులు' నవలకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నవల పురస్కారం లభించింది. ఇదే నవలకు కొలకలూరి విశ్రాంతమ్మ నవలా పురస్కారం కూడా లభించడం విశేషం. తెలుగు భాషకు, దళిత సాహిత్యానికి డాక్టర్ మంథని శంకరయ్య అందిస్తున్న సేవలను గుర్తించి ఈ పురస్కారం ప్రకటించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. రచయితగా, నవలాకారుడిగా, విమర్శకుడిగా, శతకకర్తగా ఆయన సాహిత్య రంగంలో విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. ఓరుగల్లు ప్రాంతంలో దళిత సాహిత్యానికి ఆయన రచనలు మచ్చుతునకగా నిలుస్తున్నాయని సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. ఆయన కవిత్వంలో కనిపించే నిజాయితీ, రచనల్లో ప్రతిబింబించే వాస్తవికత సమాజంలోని వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. సాహిత్యం ద్వారా అణగారిన వర్గాల జీవితాలను, వారి అనుభవాలను సమాజం ముందుకు తీసుకురావడంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. ఇటీవల డాక్టర్ మంథని శంకరయ్యపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలోనూ, ఆయన సాహిత్య సేవలను గుర్తించి ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం సాహిత్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రచయితగా ఆయన చేసిన కృషికి ఈ పురస్కారం గుర్తింపుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ నవల పురస్కారం లభించిన సందర్భంగా వి.ఆర్. విద్యార్థి, నాగిళ్ల రామశాస్త్రి, ఆచార్య బన్న అయిలయ్య తదితరులు డాక్టర్ మంథని శంకరయ్యను అభినందించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ శాలువాతో సత్కరించారు. కాంట్రాక్ట్ అసోసియేషన్ బాధ్యులు పూలబొకేతో సన్మానించారు. దళిత సంఘాల ప్రతినిధులు, కాకతీయ విశ్వవిద్యాలయ అధ్యాపకులు, సాహిత్యాభిమానులు డాక్టర్ మంథని శంకరయ్యకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# మహాకుంభహారతితో ముగిసిన ఆషాఢ బోనాల ఉత్సవాలు

**గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనం నుంచి మహాకుంభహారతి వరకు ఘనంగా నిర్వహణ**

**మంత్రి కొండా సురేఖ**

**హైదరాబాద్, 13 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వైభవంతో విజయవంతంగా ముగిశాయని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. జూలై 16న గోల్కొండ కోటలోని జగదాంబిక మహంకాళి అమ్మవారికి తొలి బోనంతో ప్రారంభమైన ఆషాఢ బోనాల ఉత్సవాలు గురువారం ఆగస్టు 13న అదే అమ్మవారికి మహాకుంభహారతితో సంప్రదాయబద్ధంగా ముగిశాయని మంత్రి పేర్కొన్నారు. దాదాపు నెలరోజుల పాటు జరిగిన వేడుకల్లో బోనాల సమర్పణలు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, జానపద కళల ప్రదర్శనలు, అంబారీల ఊరేగింపులు, రంగం, ఘటోత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయని తెలిపారు.

**రూ.20 కోట్లతో ఘనంగా బోనాల జాతర**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసిందని మంత్రి తెలిపారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాల్లో ఆషాఢ బోనాల జాతర నిర్వహణకు రూ.20 కోట్ల నిధులు కేటాయించి వేడుకలను ఘనంగా నిర్వహించామని చెప్పారు. వేలాది ఆలయాల్లో జరిగిన బోనాల వేడుకలు ప్రశాంతంగా, సౌకర్యవంతంగా జరిగేలా పోలీస్, జీహెచ్ఎంసీ, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్, వైద్యారోగ్యం, ట్రాఫిక్ నియంత్రణ, జలమండలి తదితర శాఖలతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేశామని తెలిపారు. బోనాల జాతర విజయవంతానికి కృషి చేసిన అన్ని శాఖల అధికారులు, సిబ్బందికి మంత్రి కొండా సురేఖ అభినందనలు తెలిపారు. పలు స్వచ్ఛంద సంస్థలు అందించిన సహకారం కూడా అభినందనీయమని పేర్కొన్నారు.

**గంగా--జమునా సంస్కృతికి ప్రతీక బోనాలు**

హైదరాబాద్ బోనాలు తెలంగాణ సమాజంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్నాయని మంత్రి అన్నారు. గంగా--జమునా సంస్కృతికి ప్రతీకగా నిలుస్తూ దేశానికి లౌకిక సందేశాన్ని అందిస్తున్నాయని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం హైదరాబాద్ నగర ప్రత్యేకతను మరోసారి ప్రపంచానికి చాటిందన్నారు.

**తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలి**

"అమ్మవారి చల్లని చూపు తెలంగాణ ప్రజలందరిపై ఉండాలి. రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలి. రైతులు, మహిళలు, యువత, కార్మికులు, పేదలు, అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి. అమ్మవార్ల దయతో తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలి. శాంతి, సౌభ్రాతృత్వం, సామాజిక సామరస్యం మరింత బలపడాలి" అని మంత్రి ఆకాంక్షించారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వరుణయాగంతో ప్రభుత్వ సంకల్పం నెరవేరి, రాష్ట్రం ఎల్‌నినో ప్రభావం నుంచి తేరుకుని వర్షాలు కురుస్తుండటం అమ్మవార్ల మహిమేనని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. అమ్మవారి కృపాకటాక్షాలతో తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని మంత్రి ఆకాంక్షించారు.



# తూటాలకు తలవంచని ధైర్యం



**చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం**
**జెండా కోసం తూటాలను ఎదుర్కొన్న వీరనారి**
**క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర**
**గోహ్‌పూర్ పోలీస్‌స్టేషన్ వద్ద వీరమరణం**
**నేటి తరానికి స్ఫూర్తిగా కనకలత బారువా త్యాగం**

**జై భీమ్ ప్రత్యేక కథనం:**

నేడు మనం స్వేచ్ఛా భారతంలో స్వతంత్రంగా జీవిస్తున్నామంటే దాని వెనుక ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం, త్యాగం, బలిదానం ఉన్నాయి. కొందరి పేర్లు చరిత్ర పుటల్లో చిరస్థాయిగా నిలిచిపోగా, మరికొందరి త్యాగాలు కాలగర్భంలో మరుగునపడ్డాయి. అలాంటి అమరవీరుల్లో అస్సాంకు చెందిన వీరబాల కనకలత బారువా ఒకరు. భారతమాతను బ్రిటిష్ పాలన నుంచి విముక్తి చేయాలన్న సంకల్పంతో చిన్న వయసులోనే స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టిన ఆమె, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగి బ్రిటిష్ పోలీసుల తూటాలకు బలయ్యారు. 1942 సెప్టెంబరు 20న క్విట్ ఇండియా ఉద్యమం ప్రభావంతో అస్సాంలో స్వాతంత్ర్యోద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో గోహ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌పై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని నిర్ణయించిన స్వాతంత్ర్య సమరయోధులు, గ్రామీణులు భారీ ప్రదర్శనగా స్టేషన్ వైపు కదిలారు. ఆ ప్రదర్శనకు నాయకత్వం వహించిన వారిలో కనకలత ముందున్నారు. చేతిలో త్రివర్ణ పతాకం, గుండెల్లో దేశభక్తితో ముందుకు సాగిన ఆమెను బ్రిటిష్ పోలీసులు అడ్డుకున్నా వెనకడుగు వేయలేదు. మహిళలు శాంతియుతంగా లోపలికి వెళ్లి జెండా ఎగురవేసేందుకు అనుమతించాలని కోరినప్పటికీ పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా ప్రదర్శన ముందుకు సాగడంతో బ్రిటిష్ పోలీసులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో కనకలత ఛాతిలోకి తూటా దూసుకెళ్లి ఆమె అక్కడికక్కడే వీరమరణం పొందారు. ఆమెతో పాటు ముకుంద కాకతి కూడా తీవ్రంగా గాయపడి అనంతరం ప్రాణాలు కోల్పోయారు. గోహ్‌పూర్ కాల్పులుగా చరిత్రలో నిలిచిన ఈ ఘటన అస్సాం ప్రజల పోరాట స్ఫూర్తికి ప్రతీకగా మారింది. అస్సాంలోని బరంగాబరి గ్రామానికి చెందిన కనకలత చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి కుటుంబ బాధ్యతలను భుజాన వేసుకున్నారు. దేశభక్తి గేయాలు, స్వాతంత్ర్యోద్యమ సమావేశాలు ఆమెపై ప్రభావం చూపడంతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమంలో ఆమె చురుకుగా పాల్గొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో అస్సాంలో యువత, సత్యాగ్రహులతో ఏర్పడిన 'మృత్యు బాహిని'లో ఆమె కూడా భాగమయ్యారు. పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ కార్యాలయాలపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడం ఉద్యమంలో ముఖ్యమైన కార్యాచరణగా మారిన నేపథ్యంలో గోహ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌పై జెండా ఎగురవేయడానికి జరిగిన ప్రదర్శనలో కనకలత ముందుండి నడిచారు.





బ్రిటిష్ పోలీసుల కాల్పుల్లో ఆమె ప్రాణాలు కోల్పోయినా ఉద్యమకారుల సంకల్పం ఆగలేదు. కాల్పుల మధ్యే జాతీయ పతాకాన్ని పోలీస్‌స్టేషన్‌పై ఎగురవేశారు. స్వాతంత్ర్యం కోసం ఎన్నో కుటుంబాలు తమ వారిని కోల్పోగా, ఎందరో యువకులు, యువతులు తమ భవిష్యత్తును త్యాగం చేశారు. కనకలత బారువా వంటి వీరుల రక్తంతోనే స్వేచ్ఛా భారతానికి పునాదులు పడ్డాయి. నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ స్వేచ్ఛ విలువను గుర్తించడంతో పాటు చరిత్రలో ప్రముఖులకే పరిమితం కాకుండా దేశం కోసం ప్రాణాలర్పించిన కనకలత బారువా వంటి మరుగునపడిన వీరుల త్యాగాలను కూడా నేటి తరానికి పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. ఆమె చేతిలోని జాతీయ పతాకం నేలకొరగలేదు.. ఆమె ప్రాణాలు పోయినా దేశభక్తి మాత్రం తలవంచలేదు. అదే కనకలత బారువా త్యాగం మనకు అందించే సందేశం.

# భారత ప్రధాన న్యాయమూర్తి పట్ల అగౌరవం

**నల్సార్ విద్యార్థులకు బార్ కౌన్సిల్ షాక్**
**న్యాయవాదులుగా నమోదు చేయకుండా ఆదేశం**

**హైదరాబాద్,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం 2026 బ్యాచ్ విద్యార్థులకు సంబంధించి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. 2026లో నల్సార్ నుంచి న్యాయ పట్టా పొందిన విద్యార్థులను తదుపరి ఆదేశాలు వచ్చే వరకు న్యాయవాదులుగా నమోదు చేయవద్దని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లను బీసీఐ ఆదేశించింది. నల్సార్ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడంపై కొందరు విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 2026లో పట్టా పొందనున్న విద్యార్థులతో పాటు ఇతర బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు కూడా ఈ అభ్యంతరాలకు మద్దతు తెలిపినట్లు సమాచారం. ఇటీవల ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన నిరసనలకు సంబంధించి సీజేఐ చేసిన వ్యాఖ్యలే విద్యార్థుల అభ్యంతరాలకు కారణంగా నిలిచాయి. ఈ నేపథ్యంలో బీసీఐ సంచలన నిర్ణయం తీసుకుంది ల్సార్ యూనివర్సిటీ నుంచి 2026లో న్యాయ పట్టా పొందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేయకూడదని రాష్ట్ర బార్ కౌన్సిళ్లకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా ఆదేశాలు జారీ చేశారు (అఏఏ ఞబీసాజీ ఐజీనిబి ఔంఒఞాంఖీ జనితిలఽసబతిబా). అంతేకాకుండా, విశ్వవిద్యాలయంలో విద్యార్థుల నిరసనకు సంబంధించి ప్రధానంగా ఎవరు ప్రచారాన్ని ప్రారంభించి, సమన్వయం చేశారో వివరాలతో కూడిన నివేదిక ఇవ్వాలని నల్సార్ విశ్వవిద్యాలయాన్ని బీసీఐ కోరింది.

# 17 ఓట్ల ఆధిక్యంతో కొండా కరుణాకర్ విజయం..

**వరంగల్ పోలీస్ అధికారుల సంఘానికి కొత్త కార్యవర్గం**
**పారదర్శకంగా ముగిసిన ఎన్నికలు.. ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ ఎన్. శ్వేత**
**110 మంది పోలీస్ అధికారుల ఓటింగ్.. నూతన కార్యవర్గానికి అభినందనలు**





**వరంగల్, 13 ఆగస్టు 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలు గురువారం కమిషనరేట్ కార్యాలయంలోని రాణి రుద్రమదేవి ప్రాంగణంలో ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించారు. పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఎన్నికల నోడల్ అధికారి అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అదనపు డీసీపీ శ్రీనివాస్, ఏసీపీలు సదయ్య, నాగయ్య పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. వివిధ హోదాల్లో పనిచేస్తున్న మొత్తం 110 మంది పోలీస్ అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఎన్నికలు జరుగుతున్న ప్రాంగణానికి చేరుకుని ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారి, ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులకు సూచించారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ కొండా కరుణాకర్ తన సమీప ప్రత్యర్థి ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ టి. బాబుపై 17 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. దీంతో వరంగల్ కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా కొండా కరుణాకర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి. సతీష్ (ఆర్ఐ), బి. శరత్ కుమార్ (ఆర్ఎస్ఐ), ప్రధాన కార్యదర్శిగా ఇ. వీరభద్రరావు (దామెర ఎస్ఐ), సంయుక్త కార్యదర్శిగా టి. నరేష్ (కాజీపేట కానిస్టేబుల్), కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎస్. ప్రవీణ్ కుమార్ (ఏఆర్ కానిస్టేబుల్), కోశాధికారిగా బి. నరేష్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికయ్యారు. కార్యనిర్వాహక సభ్యులుగా యం. తులసి (మహిళా కానిస్టేబుల్, కాజీపేట), సి.హెచ్. మహేందర్ యాదవ్ (ఏఆర్ కానిస్టేబుల్), ఏ. రమేష్ (ఏఆర్ కానిస్టేబుల్), ఎన్. ప్రవీణ్ (సుబేదారి కానిస్టేబుల్), యం.డి. తాజుద్దీన్ (హన్మకొండ ట్రాఫిక్ కానిస్టేబుల్), పి. సర్వేశ్ (పాలకుర్తి కానిస్టేబుల్) ఎన్నికయ్యారు. ఎన్నికల అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ అభినందించారు. పోలీస్ అధికారుల సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం, అధికారుల మధ్య సమన్వయం పెంపొందించే దిశగా నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించిన ఎన్నికల నోడల్ అధికారి, నిర్వహణ కమిటీ సభ్యులు, సంబంధిత పోలీస్ అధికారులను కూడా కమిషనర్ అభినందించారు.

# ఘనంగా ఆస్పైర్ సమ్మిట్ 3.0

**ముఖ్య అతిథులుగా నారాయణ**
**విద్యాసంస్థల డైరెక్టర్ పి. రమణారాయణ, జీఎం గోపాల్‌రెడ్డి**

**కాజీపేట, 13 అగస్టు 2026(జై భీమ్ న్యూస్)**




నారాయణ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికగా 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఆస్పైర్ సమ్మిట్ 3.0 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి. రమణారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పి. రమణారాయణ మాట్లాడుతూ 2025--26 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలోని నారాయణ స్కూల్ విభాగం విద్యాసంస్థలు ఉత్తమ ప్రతిభ కనబరిచి ముందంజలో నిలవడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల ఉత్తమ ఫలితాల కోసం ఉపాధ్యాయులు, ప్రిన్సిపల్స్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. వరంగల్ జోనల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ రిజ్వానా ఇమ్రాన్ మాట్లాడుతూ వరంగల్ జోన్‌లోని స్కూల్ విభాగంలో వరంగల్ ఓఎన్‌సీఎస్ హైస్కూల్, కాజీపేట ఈఎన్‌సీఎస్ హైస్కూల్, హంటర్ రోడ్ హెచ్‌టీఆర్ స్కూల్ విశేష ప్రతిభ కనబరిచాయని తెలిపారు. ఆయా పాఠశాలలకు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులు, ప్రత్యేక పురస్కారాలు లభించాయని పేర్కొన్నారు. తమకు నిరంతరం మార్గదర్శనం చేస్తూ ప్రోత్సహిస్తున్న నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి. రమణారాయణ, జీఎం గోపాల్‌రెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ప్రిన్సిపల్స్ రాజశేఖర్, అనిత, మమత, కోఆర్డినేటర్లు సాయికృష్ణ, శ్యామల, శిరీష, ఏఓలు ఆదిల్, చేరాలు, హరీష్, అకాడమిక్ విభాగానికి చెందిన వంశీకృష్ణచారి, వైస్ ప్రిన్సిపల్స్ అనూష కర్ణశ్రీ, అనూష మౌనిక, పాజిలత్, సబిత తదితర ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# కొత్త బెంచ్ మార్కుగా అమరావతి నిర్మాణం

**ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చేలా రాజధాని**
**న్యూయార్క్ టైమ్స్ కథనంపై చంద్రబాబు హర్షం**

**అమరావతి,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిపై న్యూయార్క్ టైమ్స్‌లో వచ్చిన కథనంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. అమరావతిని కేవలం రాజధానిగా కాకుండా భారతదేశంలో జీవన ప్రమాణాలకు కొత్త బెంచ్‌మార్క్‌గా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ ఆకాంక్షని సీఎం పేర్కొన్నారు. అమరావతి పచ్చదనం, సమర్థత, సమ్మిళితత్వంతో కూడిన నగరంగా రూపుదిద్దుకోవాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజల రోజువారీ జీవన నాణ్యతకు ప్రాధాన్యమిస్తూ అమరావతి నిర్మాణం జరుగుతోందని సీఎం చంద్రబాబు తెలిపారు. భారత్‌లో ప్రపంచస్థాయి పట్టణ జీవనం సాధ్యమేనని అమరావతి నిరూపిస్తుందని చెప్పుకొచ్చారు. ఈ మేరకు అమరావతి అభివృద్ధి లక్ష్యాలను ప్రశంసిస్తూ న్యూయార్క్ టైమ్స్ ప్రచురించిన కథనాన్ని తన ఎక్స్ పోస్టుకు ఆయన జత చేశారు. ఈ సందర్భంగా రాజధాని అభివృద్ధి దృక్పథాన్ని న్యూయార్క్ టైమ్స్‌లో ప్రస్తావించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. భారతదేశానికే అమరావతి ఆదర్శంగా నిలవాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కాగా, అమరావతి నిర్మాణంపై న్యూయార్క్ టైమ్స్ కీలక కథనం ప్రచురించింది. ఏపీ రాజధానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మద్దతు ఉందని ఆ కథనం పేర్కొంది. అమరావతిలో రోజూ 25 వేల మందికి పైగా నిర్మాణ పనుల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించింది. ప్రముఖ బ్రిటిష్ ఆర్కిటెక్ట్ నార్మన్ ఫోస్టర్ రూపకల్పనలో అమరావతి నగర నిర్మాణం సాగుతోందని తెలిపింది. ప్రభుత్వ భవనాలతో పాటు సుమారు ఐదు మైళ్ల మేర విస్తరించే ప్రభుత్వ కార్యాలయాల సముదాయం సిద్ధమవుతోందని చెప్పుకొచ్చింది. అలాగే, అమరావతి నిర్మాణాన్ని నిర్ణీత కాలంలో పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశిరచుకుందని ప్రస్తావించింది. 2029 ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని పనులను వేగవంతం చేస్తున్నారని న్యూయార్క్ టైమ్స్ కథనం పేర్కొంది.

# విజయవాడ నుంచి కాశీకి నేరుగా విమానం

**ఇండిగో సర్వీసును ప్రారంభించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

**విజయవాడ,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

ఏపీ ప్రజలకు మరో కీలక విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. విజయవాడ విమానాశ్రయం నుంచి వారణాసికి నేరుగా నూతన ఇండిగో సర్వీసులను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కాశీ యాత్ర మరింత సులభం కానుంది. ఈ విమాన సర్వీసులు వారానికి మూడు రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. మంగళ, గురు, శనివారాలు ఈ నగరాల మధ్య విమానాలు నడపనున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రాంతీయ విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు దేశంలోని టైర్-2, టైర్-3 నగరాలను ప్రధాన విమానాశ్రయాలకు అనుసంధానం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభం రాష్ట్ర విమానయాన రంగంలో మరో కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు. విమాన ప్రయాణాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ కొత్త సర్వీసు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చనుందన్నారు. మరోవైపు హుస్సేన్ సాగర్, ప్రకాశం బ్యారేజ్, శ్రీశైలం జలాశయం మధ్య సీ ప్లేన్ ప్రాజెక్ట్ కోసం వ్యూహరచన సిద్ధం చేస్తున్నామని రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, పౌర విమానయానశాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇండిగో ప్రతినిధులు పాల్గొన్నారు.

# చంద్రగిరిలో ఏనుగుల హల్‌చల్

**పంటపొలాలను ధ్వంసం చేసినట్లు రైతుల వెల్లడి**

తిరుపతి,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్): జిల్లాలోని చంద్రగిరి మండలం యల్లంపల్లిలో మరోసారి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి గ్రామ పరిసరాల్లోకి సుమారు 15 ఏనుగులు చొరబడి పంట పొలాలపై దాడి చేశాయి. వరి పంటతో పాటు పశువుల కోసం సాగు చేసిన గడ్డి పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. రైతులకు చెందిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాత్రివేళ ఏనుగుల గుంపు ఒక్కసారిగా పంట పొలాల్లోకి రావడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడితో నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు మళ్లీ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండటంతో యల్లంపల్లి ప్రజల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఏనుగులు ఎప్పుడు, ఎటువైపు నుంచి వస్తాయో తెలియక రైతులు రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లేందుకు సైతం భయపడుతున్నారు. పంట నష్టానికి పరిహారం అందించడంతో పాటు ఏనుగులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారంతో అటవీ అధికారులు రంగంలోకి దిగి ఏనుగుల కదలికలను పరిశీలిస్తున్నారు. ఏనుగుల గుంపును సురక్షితంగా అటవీ ప్రాంతం వైపు తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

# రైలు ఢీకొని టీచర్ మృతి

**మహబూబాబాద్,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. పుష్‌పుల్ రైలు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ గౌస్‌మియా మహబూబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌస్‌మియా మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

# పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి





**గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం**
**రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు**
**వారు చేసిన చేతబడి తిరగబడింది**
**నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం**
**ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్**

**హైదరాబాద్,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు.డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళు తున్నాం అని వివరించారు. ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

# ఆబిడ్స్‌లో కారు బీభత్సం

**మహిళను ఢీకొన్న కారు**
**తీవ్రంగా గాయపడిన సునీత**
**సినీ నిర్మాతపై కుటుంబ సభ్యుల ఆరోపణలు**
**అబిడ్స్ పోలీసుల కేసు నమోదు**
**ప్రమాదంపై దర్యాప్తు కొనసాగింపు**

**హైదరాబాద్, ఆగస్టు 13 (జై భీమ్ న్యూస్):**

నగరంలోని అబిడ్స్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళను కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గన్‌ఫౌండ్రీ ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత.. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సినిమా నిర్మాత డ్రైవర్ మహానంద నడుపుతున్న కారు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో సునీత కాలుకు ఫ్రాక్చర్ కావడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని.. ఫిల్మ్ ప్రొడ్యూసర్ బొమ్మకు మురళి అని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన అనంతరం ఆయనకు ఫోన్ చేసి సునీత చికిత్సకు అయ్యే ఖర్చులను భరించాలని కోరినట్లు చెప్పారు. అయితే డబ్బులు ఇవ్వనని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు వారు వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు.. అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అంత్యక్రియలకు వచ్చి..

**చెరువులో దిగి ఇద్దరు మృత్యువాత**

**సంగారెడ్డి,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బంధువు అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన గణెళిష్ (30), మునిరాజు (58) ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఇద్దరూ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణెళిష్‌కు ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. చెరువులో మునిగిపోతున్న గణెళిష్‌ను గమనించిన మునిరాజు.. కాపాడేందుకు వెంటనే నీటిలోకి వెళ్లాడు. అయితే గణెళిష్‌ను రక్షించే ప్రయత్నంలో మునిరాజు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ చాలాసేపు బయటకు రాకపోవడంతో అక్కడ ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందడంతో స్థానికులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీసినట్లు సమాచారం. అంత్యక్రియలకు హాజరైన కుటుంబాల్లో ఈ ఘటన మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# అప్ప తీర్చనందుకు బాలికను తీసుకెళ్లే యత్నం

**కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల కేసు**

**హైదరాబాద్,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లో బాకీ తీర్చలేదని రెండేళ్ల బాలికను కిడ్నాప్‌నకు ఓ వ్యక్తి యత్నించాడు. అప్పు తీర్చలేదనే కోపంతో బాలికను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హనుమాన్ నగర్‌లో అద్దె ఇంట్లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. మానికేశ్వరీ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో పరిచయస్తుడి వద్ద రూ.30 వేల అప్పును బాలిక కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో బుధవారం ఇంటికి ఆ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతో సదరు వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇచ్చే వరకు మీ కుమార్తెను తీసుకెళ్తానంటూ అతడు బెదిరించాడు. రెండేళ్ల బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాధిత కుటుంబం పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

# ఇంద్రకీలాద్రిపై మొబూల్ ఫోన్లు నిషేధం

**దర్శనానికి ముందే డిపాజిట్ చేయాల్సిందే**

**విజయవాడ,ఆగస్ట్13(జై భీమ్ న్యూస్):**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులకు కొత్త భద్రతా నిబంధనలను ఆలయ అధికారులు అమలులోకి తీసుకొచ్చారు. ఆలయ ప్రాంగణంలోకి మొబైల్ ఫోన్లపై పూర్తిస్థాయిలో నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. స్కానింగ్ పాయింట్ వద్ద కొత్త భద్రతా గేట్ ఏర్పాటు చేశారు. స్కానింగ్ తర్వాత మొబైల్ ఫోన్ లోపలికి వెళ్లకుండా కఠినంగా తనిఖీలు చేయనున్నారు. ఈ నిబంధనల ప్రకారం, క్యూ లైన్లలోకి వెళ్లే ముందే ఫోన్లను డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. మొబైల్ ఫోన్ల కోసం ప్రత్యేక డిపాజిట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. భద్రతా తనిఖీలను కట్టుదిట్టం చేయాలని ఆలయ ఈవో శీనా నాయక్ ఆదేశాలు జారీ చేశారు. హోంగార్డులు, అజైల్ సెక్యూరిటీ సిబ్బందితో పటిష్ఠమైన భద్రతను కల్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రద్దీ నియంత్రణకు దర్శన లైన్లలో మార్పులు చేపట్టారు. దర్శన టికెట్ల జారీ కౌంటర్ల స్థానాల్లో మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఉచిత లడ్డూ ప్రసాదం కౌంటర్లను కూడా అధికారులు మార్చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా నేరుగా దర్శనానికి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.